కథానిక:

నరసమ్మ కాపురం

శ్రీ పెనుమర్తి కామేశ్వర రావు

నేనిక్కడే ఉంటాను!' అన్నది నరసమ్మ తండ్రితో— నిశ్చయంతో. 'బాగా ఆలోచించుకో. స్త్రీ భర్తతో నుండాలి కాని పుట్టింట్లో నుండరాదు. అందువలన నీకూ, మాకూ అవమానం! యుక్తవయస్కురాలివి—ప్రపంచజ్ఞానం కలదానివి, చదువుకున్నదానివి—నీకొకరు బోధించ నవసరం లేదు.' అన్నాడు తండ్రి పట్టాభిరామయ్య. ఆయన తాసిల్దారుద్యోగం చేస్తున్నాడు.

"అందువలననే—బాగా ఆలోచించుకుని నేనీ నిర్ణయానికి వచ్చాను. నా పెళ్ళికిముందు మీరు నాతో సంప్రదించి ఉంటే, నే నాయనను పెళ్లాడిఉండే దాన్నే కాను. నల్లగా మసిబొగ్గులాంటి వాడికిచ్చి పెళ్లిచేసి మీరే నాజీవిత సౌఖ్యాన్ని నాభవిష్యత్తునూ నాశనం చేశారు! అన్నది నరసమ్మ.

'అతనికేం? పెళ్లినాటికి అతను స్కూల్ ఫైనల్ చదువుతున్నాడు. సంపన్న కుటుంబం. పాతి కెకరాల మాగాని పొలముంది. ఒక్కడే కొడుకు తండ్రికి. కట్నముకూడా వెయ్యిన్నూట పదారులే యిచ్చాను. అతనిలో లోపమేమీ లేదు. నీ తెలివితక్కువతనం కాని—అమ్మాయి! అతను నల్లగా నున్నాడంటున్నావు. నేను నల్లగా లేనూ? మా వంశంలో నీవలె మాట్లాడినవాళ్లు లేరు. నీవు నీభర్తతో కాపురం చేయక ప్రపంచాన్ని ఉద్ధరించగలవని నేను భావించటంలేదు. ఈకాలంలో చదువుకున్న ఆడపిల్లల్ని ఎందర్నో చూచాను కాని ఇలా మొండిగా మాట్లాడే స్త్రీలు చాలా తక్కువ!' అన్నాడు తాసిల్దారు.

'నాకాభర్త అక్కరలేదు. నేనిక్కడనే ఉండి హిందీ చదువుకుంటాను. మీకిష్టములేకపోతే నాదోవ నేను చూచుకుంటాను!' అన్నది నరసమ్మ.

తండ్రీ కూతుళ్ల మధ్య నీవిధంగా సంభాషణ జరుగుతుండగా తల్లి రాజేశ్వరమ్మ అక్కడికి వచ్చింది. తాసిల్దారు భార్యతో—

'నీవంటి పచ్చని మనిషి నాతో కాపురం చేయడం భావ్యంకాదు. అమ్మాయిమాటలు విని నువు కూడా నన్ను వదిలిపెట్టి హిందీ చదువుకోవచ్చు మీ పుట్టింట్లోఉండి!' అన్నాడు వ్యంగ్యంగా.

'మీ మాటలు చాలుగాని, అది చిన్నపిల్ల. అల్లుడు పెళ్ళినాటి అల్లుడు కాడు. పరమ దుర్మార్గుడైనాడు. అతనికీ తండ్రికీ సంబంధము లేదు. అతను మనతోనైనా అనుకూలంగా నుంటంలేదు. పెళ్లినాడతను ముందుముందు పెద్దచదువు చదువుతాడనుకున్నాం. స్కూల్ ఫైనల్ తప్పాడు వరసని మూడు వత్సరాలు. చదువు మానేశాడు. గాలికి తిరుగుతున్నాడు. వాడికంటే ముష్టిముండాకొడుకు నయం. ఇంటికివచ్చినప్పుడల్లా పెళ్ళాన్ని రెండుబాది తగవు లాడతాడు. నే వింటూండగా—'నువు తాసిల్దారు కూతురివైతే నాకేం? నా పెళ్లానివైన తరువాత నువు నాచెప్పు చేతల్లో పడుండాలి. అంతేగాని, నిక్కితే ఒక్కక్షణంకూడా సహించేది లేదు. కబడ్దార్' అన్నాడు. అల్లుడికి మీమీద గౌరవమేమీ లేదు.' అన్నది రాజేశ్వరమ్మ.

'అల్లుడికి నామీద గౌరవం లేనందున నాకేమీ విచారంలేదు. అమ్మాయితో అనుకూలంగానుంటే— నాకిప్పుడున్న గౌరవంపోదు. అమ్మాయికి నామీద గౌరవముంది కనుకనా- అల్లుడికి లేదని నేను విచారపడడానికి! భర్తతో కాపురం చేయదుట! మన కుటుంబగౌరవం నాశనం చేయడానికే యిదిపుట్టింది. దీనికి నీమద్దత్తు. అమ్మాయి నేవిధంగానైనా అల్లుడి

దగ్గరకు పంపడం మనధర్మం !' అన్నాడు తాసిల్దారు.

'అమ్మాయిని పంపడానికి—అల్లుడికో యిల్లూ వాకిలీ లేదు. తండ్రినుంచి విడిపోయాడు. అతనికి సినిమాపిచ్చి పట్టుకుంది. 'మింగమెతుకు లేదు, మీసాలకు సంపెంగనూనె' అన్నట్లుగా స్వతంత్రంగా జీవించడానికి ధనాదాయం చాలటంలేదు— సినిమా డైరక్టరవుతాడుట ! అతని ఆలోచనలు చాలా పెద్దవి. ఏ ఆలోచనలున్నా ఫరవాలేదు. తనవంటి అనాకారివాడికి, బంగారు బొమ్మలాంటి భార్య లభ్యమైంది కదా— దానిమీద అనురాగం కలిగిఉండాలంటారా లేదా ?' అన్నది రాజేశ్వరమ్మ.

'కొత్తలో భార్యాభర్తలు తగువులాడుకుంటారు. తరవాత వాళ్ళే అనుకూలంగా వుంటారు. వాళ్ల జీవితాలు సరిదిద్దే బాధ్యత తల్లిదండ్రులపై నుంటుంది. పురుషుడు స్వతంత్రుడు. స్త్రీ అబల. అటువంటప్పుడు— అన్నీ తెలిసిన మనం- అమ్మాయి కాపురం కుదురుచేయడానికి ప్రయత్నించాలి కాని, దాని తెలివితక్కువ ఆలోచనల్ని బలపరచకూడదు. నేనా తాసిల్దార్ని. గౌరవప్రతిష్ఠలతో బ్రదుకుతున్నవాణ్ని. నాకీ విషయమొక సమస్యగా పరిణమిస్తే— అది నేభరించలేను. నీవు తల్లివి. కూతురికి చెప్పవలసినవి చెప్పి— ప్రయాణానికి సిద్ధంచేయించు. అల్లుడు ఏభయిరూపాయిలు సంపాయించుకుంటున్నాడనీ, చాలా కుదురుగా వుంటున్నాడనీ నాకు వర్తమానం వచ్చింది. అమ్మాయిని నేను వెంట తీసికెళ్లి, అతని వద్దదించి వస్తాను.' అన్నాడు తాసిల్దారు. అవెంటనే, ఆఫీసు టైమవుతుండడంవల్ల, పట్టాభిరామయ్య త్వరత్వరగా భోజనంచేసి, ఆఫీసుకు వెళ్ళిపోయాడు. ఆయన యింటినుంచి వెళ్లిందిమొదలు, నరసమ్మకోపవదనయై దుఃఖభారంతో—తన గదిలో, పందిరి మంచంలో బోర్లబరుండి నిట్టూర్పులు విడువసాగింది. ఆమెకు జీవితంమీద విరక్తి కలిగింది. రాత్రి పన్నెండు గంటలవేళ బావిలో దూకిచస్తే తనకీ సమస్య వదిలిపోతుందనుకున్నది. ఎందరో స్త్రీలా గ్రామంలో కాలువలో పడి చస్తున్నారు. వాళ్లు జీవితంలో కష్టాలు భరించలేక, ఆ ప్రవాహవేగంలో లీనమైపోతున్నారు. ఏభయి రూపాయిలు సంపాదించే నల్లని భర్తతో యీ కాలంలో ఎలా కాపురంచేయడం? ఏభయిరూపాయిలు అతని సాదరుఖర్చులకే సరిపోవు. పట్టణాలలో ఇంటిఅద్దెలు, ధరలు పెరిగినయి. బియ్యం రూపాయికి మూడుసోల లిస్తున్నారు. ప్రతిదినం, తనకు రెండుపూటలు కాఫీ ఉండాలి. పూలు కావాలి, సబ్బులు కావాలి. ఇంకా ఎన్నో కావాలి ! ఏభయిరూపాయిల ఉద్యోగంలో వున్నవాడు తన భార్యని పోషించడ మెంతకష్టమో తండ్రికేం తెలుసు? తనకు నెలకు రెండువందలు రూపాయిలు వస్తున్నా సరిపోవడం లేదని, తానెన్నిసారులో విసుక్కున్నాడు. నరసమ్మకు దుఃఖభారంలో ఎన్నో ఆలోచనల పరంపరలు తామరతంపరగా తోచినయి. ఇంతలో తల్లివచ్చి అన్నానికి రమ్మని పిలిచింది.

'నాకాకలిగాలేదు : నాకు అన్నం అక్కరలేదు !' అన్నది నరసమ్మ.

'ఇలా అలిగితే తల్లినైన నాకెంత విచారంగానుంటుందో నీకు తెలుసా ? నీవన్నం తినకపోతే నేను తినను !' అన్నది తల్లి.

'ఏభయి రూపాయిలు యీకాలంలో ఆయన సాదరుఖర్చులకు సరిపోదు. ఆయన కాఫీలు, సిగరెట్లు, ఇస్త్రీబట్టలు— వాటి సంగతి నాకు తెలుసు ! ప్రతినెల నాన్నగారో ఏభయిరూపాయిలు నాకు పంపిస్తే, నాస్వంతానికి వాడుకుంటాను. ఆఏర్పాటు జరిగితే మీగౌరవం కాపాడేటందుకు— నేనాయనతో వుంటాను. నాకాయనమీద ఇష్టంలేకపోయినా !' అన్నది నరసమ్మ ఆత్మహత్యోద్దేశ్యం విరమించుకొని.

'ఈవిషయం గూర్చి నాన్నగారితో మాట్లాడుదాం— అన్నం తిందాం, రా' అన్నదితల్లి.

నరసమ్మకు పద్ధెనిమిదోయేడు. తండ్రిచామనఛాయవాడు కాని తల్లివలె నామె చక్కనిశరీరచ్ఛాయకలది. విశాలనేత్ర. నొక్కులు నొక్కులుగానుండే శిరోజములు. బాల్యనుంచీ అల్లారుముద్దుగా పెరిగింది. థర్డుఫారందాకా ఇంగ్లీషు చదువుకుంది. చక్కని చుక్కలలో నామెకు మొదటితరగతి లభింపదు కాని, సంపాదనా పరుడైన భర్త ఆమె అభిరుచుల కనిపెట్టి, ఆమె నధునాతన పద్ధతులలో తయారుచేయుటకు కృషిచేసి, ఆమెను విప్లవభావములు గల మహిళా సమాజములో చేర్పించినచో, నరసమ్మ

రెండవతరగతి అందగత్తెకాగల అవకాశములు లేక పోలేదు. కాని ఆమె భర్త సూరి సంపాదనాపరుడని చెప్పడానికి వీలుకాని పరిస్థితులలో నుండుటవలన ఆమె మూడవతరగతి అందకత్తెగా భావించడానికేమీ అభ్యంతరముండదు.

౨

ఆ సాయంత్రం ఆఫీసునుంచి రాగానే పట్టాభిరామయ్య ప్రశ్నూడదీసి భార్యనిపిలిచి— 'ఏమైనా తేలిందా?' అన్నాడు.

'ఆఁ. తేలింది, అమ్మాయికి నెలకో ఏభయి రూపాలు మీరు పంపుతుంటే, మీ గౌరవం నిలిపేటందుకు భర్తతో కాపురం చేస్తుందిట! అల్లుడు సంపాదించే ఏభయిరూపాయిలతో, నిజంగా యీకాలంలో సంసారం గడవటం చాలాకష్టం! మీరిందు కంగీకరిస్తే ఏదోమంచిరోజు విచారించి, మీరే అమ్మాయిని స్వయంగాతీసికెళ్లి, అతనివద్ద దించి, అతనికిచెప్ప వలసినవన్నీ చెప్పి— అతనున్న ఇంటివారితో కూడా అమ్మాయిని కాస్తకనిపెట్టి ఉండమని చెప్పిరండి! అసలు— అల్లుడిప్పుడు ఆవూళ్లో చేస్తున్న ఉద్యోగమేమిటి?' అన్నది రాజేశ్వరమ్మ.

'ఆ ఉద్యోగంసంగతి నాకూ సవిస్తారంగా తెలియదు. ఆ ఊరి ప్లీడరొకడు నా స్నేహితుడు, అతను మన అల్లుణ్ని బాగా ఎరిగున్నాడట! అతను చెప్పాడు సూరి చాలా కుదురుగల కుర్రాడని! తమ యింట్లోనే ఉంటున్నాడుట! ఆ ప్లీడరు కో మేడ ఉంది! బాగా సంపాదనవుంది— ఆస్తిపరుడు కూడా! అమ్మాయికి ప్రతినెలా ఏభయిరూపాయలు నేను పంపవలసిన అవసర మేఉండదు. ఏదైనా అత్యవసరపరిస్థితి ఏర్పడితే— అమ్మాయి నాపేర ఉత్తరం రాస్తే— నేను డబ్బుపంపడమో, లేక స్వయంగా వెళ్లి చూచిరావడమో చేయగలను. దానికి కాపురానికి కావలసిన పాత్రసామాను, ఒకమంచం, పరుపు, ట్రంకుపెట్టె, రెండుకుర్చీలు, ఒకటేబిలు, మొదలైనవి కొనిఇచ్చి, దానికో ఏభయిరూపాల చీరకొని— మరొక ఏభయిరూపాయిలు దగ్గరుంచుకోమని యివ్వ నిశ్చయించాను. మొత్తం అంతా రెండువందలరూపాయలు పైనే ఖర్చు. అయినా ఫరవాలేదు: అది భర్తతో అనుకూలంగా కాపురంచేసి సంతానవతియై, ఉభయకుటుంబాలకూ కీర్తి ప్రతిష్ఠలు తీసుకువస్తుందని నానమ్మకం! ఇదీ విషయం!' అన్నాడు తాసిల్దారు.

ఈమాటలన్నీ నరసమ్మ వినిచాలా సంతోషించింది.

'పోనీ—ఆప్లీడరు పేర ఓ వుత్తరం రాయండి! అల్లుడేం వుద్యోగం చేస్తున్నదీ తెలియబరచమని. లేదా, ఆయన్ని ఒకసారి ఈవూరువచ్చి మాట్లాడిపొమ్మని రాయండి!' అన్నది రాజేశ్వరమ్మ— ఆప్లీడ రెటువంటి వాడోనని సందేహంతో.

ఈసలహా విని నరసమ్మ 'ఆప్లీడరుగారి కుత్తరం రాసి పిలిపించడం మర్యాదకాదులే—అమ్మా! నేను అన్నీ విన్నాను. ఇక మంచిరోజు విచారించండి. నేను నాభర్తదగ్గర నుంటానికి నాకేమీ అభ్యంతరంలేదు.' అన్నది. ఆమాటలు వినగానే పట్టాభిరామయ్య నేత్రాంచలాల నానంద బాష్పములురాల— నాతల్లి ఎంతబుద్ధిమంతురాలు! నాగర్భవాసాన జన్మించిన కుమార్తె నామాట వినటం లేదేమో అని నేనెంతగా మనస్సులో బాధపడుతున్నానో నీకు తెలియదు.' అన్నాడు.

'నాన్నగారూ! నేను గ్రాయికం తెలిసిన దానిని. తాడూ బొంగరం లేనివ్యక్తితో సంసారం చేయడమెట్లాగా అనే సంకోచంతో నేనింతకాలం నుంచీ మీమాట కెదురుచెప్ప సాహసించాను. నన్ను క్షమించండి నాన్నగారూ! మీ గౌరవహాని కలిగే విధంగా ప్రవర్తించాలని నేనెన్నడూ ఊహించలేదు! ఆయనొక ప్లీడరుగారి అండనుంటున్నాడని, ఏభయి రూపాయిలు సంపాదిస్తున్నాడని విన్న తరవాత, నా సందేహం తీరింది. మీరు నాకోస మిప్పుడు రెండువందల రూపాయలు ఖర్చుపెడతాననడం విన్న తరువాత, నాకానందం కలిగింది. నాకవసర మున్నప్పుడల్లా, నాకో పాతికరూపాయలు పంపితే చాలు నాన్నగారూ! మిమ్మల్ని డబ్బు డబ్బని బాధపెట్టను లెండి నాన్నగారూ!' అన్నది నరసమ్మ.

పట్టాభిరామయ్య కూతురు ప్రయాణానికి మంచిరోజు విచారించి, కావలసిన సామాను కొనవలసిందని భార్య చేతికి రెండువందల రూపాయలిచ్చాడు.

తల్లీ, కూతురు గుర్రంబండీలో బజారుకు వెళ్లి సామానంతా కొని తీసుకవచ్చారు. కాఫీకి ఒక ఫిల్టరు, ఇడ్డెన్లు వండుకునే పాత్ర—ఒక టేమిటి? నరసమ్మ కోరిన సామానంతా కొన్నది తల్లి.

పట్టాభిరామయ్య అల్లుడు పేర నొక కవరు, అతనుంటుంటే ఇంటియజమాని ప్లీడరు పేర నొక కవరు ఉత్తరాలు రాసి పోష్టులో వేశాడు. ఫలానా రోజున ఉదయంపాసెంజరులో తాను తన కుమార్తెను తీసుక వస్తున్నానని అందులో తెలియబరిచాడు.

3

భర్తతో కాపురం చేయడానికి వెళ్తున్న నరసమ్మను చూడడానికి గ్రామంలోనున్న దగ్గర బంధువుల తాలూకు నలుగురు ముత్తయిదువులు ఉదయం వచ్చి, ఆమెకు చెప్పవలసిన మంచి విషయాలు చెప్పారు. నరసమ్మ ఒక సిల్కుచీర ధరించింది. నల్లని సిల్కుచీరె తో సరాగం నెరపే ఎర్రని జంపరు తొడిగింది. మెడలో మంగళసూత్రాలున్న నానుతాడు, పగడాల దండమాత్రం— చేతులకు ఒక జత ఐస్ క్రీమ్ బంగారుగాజులు— ఎడమచేతికి చాలా రంగులలో దంతపుగాజులు— కుడిచేతి చిటికెన వ్రేలున ఒంటిరాయి ఉంగరం—పాదాలకు వెండి నాజూకు గొలుసులు—ముక్కున చక్కని బేసరి— మొదలైన ఆరభణాలున్నాయి. కాళ్లపిక్కలు కనిపించే లాగున చీరె అధునాతనంగా ధరించి-విలువైన చమీఖ పనితనము ప్రదర్శించే పాదరక్షలుధరించి ప్రయాణానికిసిద్ధమైంది. తండ్రీకూతుళ్లతో రాజేశ్వరమ్మకూడా చిన్నపిల్లలిద్దర్ని వెంటతీసుకొని ష్టేషన్ కువెళ్లింది— కూతురికి చెప్పవలసినవిచెప్పి, ధైర్యంవహించి భర్తతో అనుకూలంగా కాపురంచేయమన్నది.

పట్టాభిరామయ్య, కూతురుపొగబండిమీద అల్లుడుంటున్న గ్రామపు ష్టేషన్ చేరుకొన్నారు. ష్టేషన్ కు అల్లుడు వచ్చాడేమోనని, ఆయన అక్కడ కనిపించే మనుషులలో అల్లుడ్ని గుర్తించడానికి ప్రయత్నించి విఫలుడైనాడు.

ఇద్దరూ ఒక గుర్రంబండీలో, సామానుతో మరొకబండి వెంటరాగా, ప్లీడరు ఆనందరావు మేడ ముందు పదిగంటలవేళ దిగారు. పట్టాభిరామయ్య, నరసమ్మ మేడలోకి వెళ్లగానే ఆనందరావు తఆఫీసు గదిలోనుంచి బైటికివచ్చి తాసిల్దారుని పరామర్శించి- లోనికివెళ్లి భార్యతో వాళ్లకు కాళ్లుకడుక్కోడానికి నీళ్లు తెమ్మని పురమాయించాడు. ఆనందరావు భార్య సుందరమ్మ రెండుచెంబులతో నీళ్లు తెచ్చియిచ్చి, నరసమ్మ నాపాదమస్తకం పరిశీలిస్తూ నిలబడింది. తాసిల్దారు—

‘ఏవోయ్! ఆనందారావూ! మా అల్లుడున్నాడా ఇంట్లో...?’ అన్నాడు.

ఆనందరావు భార్యతో ‘ఏమే శర్మ ఎక్కడికి వెళ్లాడు?’ అని అడిగాడు. సూరి అసలుపేరు సూర్యనారాయణశర్మ కావడం— అతన్ని కొందరు ‘శర్మ’ అనీ, కొందరు ‘సూరి’ అనీ, మరికొందరు ‘నారాయణ’ అని పిలవడంకద్దు.

సుందరమ్మ ‘మార్కెట్టుకు కూరలకోసం నేనే పంపించాను. ఈ పాటికి వచ్చే వేళయింది, ఏమమ్మాయి! కాఫీతాగుదువుకాని, లోపలికిరా!’ అని నరసమ్మను లోనికి పిల్చుకవెళ్లి, ఫ్లాస్కులోనిలవవున్న కాఫీ కొంత ఒక వెండికప్పులోపోసి యిచ్చింది. నరసమ్మ సుందరమ్మను పరిశీలనగాచూచి, ఆ మేడలో గోడలకున్న చిత్రపటాలు- ఇంటిలోనున్న కుర్చీలు, సోఫాలుచూస్తూ ఆలోచనలో మునిగింది. సుందరమ్మ కొంతకాఫీ ఒక వెండిగ్లాసులో పోసి ‘మీ నాన్నగారికివ్వు. పనిచెప్పానని ఏమీ అనుకోకు నీవు మాయింట్లో పిల్లలాగుండాలి, నాకు సంతానం లేదు.’ అన్నది నిట్టూర్పుతో. నరసమ్మకాఫీతీసికెళ్లి తండ్రికిచ్చి వచ్చి సుందరమ్మకు ఎదురుగా కూర్చుంది. సుందరమ్మ వంటఇంట్లో వంటకత్తెతో ‘ఓసుబ్బమ్మగారూ! ఓ సోలెడు బియ్యం వేరే కడిగి పెట్టండి!’ అన్నది.

ఇంట్లోభార్యా, భర్త— యిరువురే అయినా వంటమనిషికూడా ఉండటంవలన నరసమ్మకు వాళ్లు సంపన్నులని అర్థమైంది. తనభర్తభోజనంకూడా ప్లీడరుగారింట్లోనే కాబోలు ననుకున్నది. తన సామాను మంచం,పరుపు. పాత్రసామాను ప్లీడరుగారిసలహామీద మేడలో ఒకగదిలో తెచ్చిబండివాడు పడేశాడు. నరసమ్మ తండ్రివద్దకువచ్చి—

‘నాన్నగారూ! వారింకా రాలేదేం?’ అన్నది.

'కూరలకోసం మార్కెట్టుకు వెళ్లాడుట. వస్తాడు—దేనికి?' అన్నాడు పట్టాభిరామయ్య.

'నాకంతా అయోమయంగా వుంది! మేం వేరే కాపురంగా వుండనప్పుడు, మాకీ సామాను అనవసరం నాన్నగారూ! ఆవిడ చాలామంచిది. పిల్లలు లేరుట. ఆయనా— నేను ఇక్కడే వుంటే, నేను వంటచేయ నక్కరలేదు. వీళ్లకు వంటమనిషికూడా ఉంది! బట్టలుతికే చాకలీ...పనిమనిషీ వున్నారుట కూడా!' అన్నది నరసమ్మ తండ్రితో.

ఇంతలో' సూరి కూరలు ఒక కూలివాడినెత్తిన పెట్టి ఇంటికి తెచ్చాడు. మధ్య హాలులో కుర్చీలలో మామగార్నీ, తనని చూచి లేచి నిలబడిన భార్యనీ ఒకసారి తిలకించి, సరాసరి వంటహాలులోకి కూరల తట్ట తీసికెళ్ళి కుమ్మరించి 'సుందరమ్మగారూ! ఇవన్నీ మూడురూపాయల ఏడణాలన్నరయినయి. ఇవిగో మిగతా డబ్బులు!' అని ఆమెచేతిలో రూపా.యి ఎనిమిదణాలన్నర పెట్టి, ముఖాన చెమట తుడుచుకుంటూ—మధ్య హాలులోనుంచి బైటికివచ్చి తట్ట కూలివాడికిచ్చాడు. మామగార్ని పలకరించలేదు. ఒక సిల్కుచొక్కా ధరించిఉన్న అల్లుణ్ని తానే పలకరించి మాట్లాడుదామని తాసిల్దారు బైటికి వచ్చాడు. సూరి తొడుక్కున్న సిల్కుచొక్కా అతనిదికాదని తెలుసుకున్నాడు—అది అతనికి చాలా పెద్దదిగా నుంటంవల్ల!

'ఏం వోయ్! అమ్మాయిని తీసుకవచ్చాను. నేరాసిన కవరందిందా?' అన్నాడు మామగారు.

'తీసుకరావద్దని నేను నిన్ననే మీపేర వుత్తరం రాశాను. అది యివాళ యీపాటికి మీయింటికిచేరి ఉంటుంది!' అన్నాడు సూరి.

'ఏం, ఎందువల్ల? నీకు ఏభయిరూపాయిల జీతమని ఆనందరావు చెప్పాడు. నీవు సినిమాసంగతులు మరిచిపోయి, కుదురుగా నంటున్నావని తెలిసి— ముందుగా నీపేర వుత్తరంకూడా రాశాను. కాపురానికి కావలసిన పాత్ర సామాను కూడా కొనియిచ్చాను' అన్నాడు పట్టాభిరామయ్య.

'ఇక్కడ నాపరిస్థితులు మీకు తెలియవు. నాకీ ఉద్యోగం దుర్భరంగా నుంది.' అన్నాడు సూరి.

ఆనందరావు కోర్టుకు వెళ్ళేటైమయిందని భోజనానికి లేచి, పట్టాభిరామయ్యను కూడా భోజనానికి ఆహ్వానించాడు. కాని అంతవరకు పట్టాభిరామయ్య స్నానం చేయలేదు.

'నేనింకా స్నానం చేయలేదోయ్! మేము తరవాతభోంచేస్తాములే. నీవు కోర్టుకు వెళ్లవలసినవాడివి. నీవు భోజనం చెయ్యి— ఫరవాలేదు!' అన్నాడు తాసిల్దారు.

'ఏవోయ్ సూరీ! నువురా—మనం కోర్టుకు పోవాలి,!' అని ఆనందరావు సూరిని పిలిచాడు. ఆనందరావుకు ఒంటరిగా భోజనం చేయడమలవాటులేదు.

ఆనందరావుతో పట్టాభిరామయ్య ఏవో సంగతులు మాట్లాడాలనుకున్నాడు. కాని వ్యవధిలేదు. తాను తన కుమార్తె విషయంలో చెప్పదలచిన సంగతులన్నీ సుందరమ్మతో చెప్పితే సరిపోతుందనుకున్నాడు! ఆనందరావు, శర్మ భోజనాలు చేసి కోర్టుకు వెళ్లారు.

పట్టాభిరామయ్య పన్నెండు గంటలకు స్నానానంతరం భోజనం చేసి ఇంటియజమానురాలు సుందరమ్మతో 'మా అమ్మాయిని మీరు మీ అమ్మాయిగా చూచుకోవాలి. మా అల్లుడు కొంత తొందరమనిషి. వాళ్లిద్దరిమధ్య సంభవించే పొరుపులు సర్దుబాటు చేస్తూ మీరు కనిపెట్టి వుంటే— ఓకాపురం నిలబెట్టినవారవుతారు. నేనీ పూట మూడుగంటల బండీకి వెళ్తున్నాను. నాకు తొందరపనులున్నయి!' అన్నాడు. ఆమె సరేనన్నది.

పట్టాభి రామయ్య ప్రయాణమైవెళ్తూ కూతురికి ధైర్యంచెప్పి, ఇరవైఅయిదు రూపాయిలిచ్చి వెళ్లిపోయాడు. నరసమ్మ ఆడబ్బుతీసికొని తన ఆనందబాష్పాలను పైటకొంగుతో తుడుచుకొని—లోనికి వెళ్లింది. సుందరమ్మ రేడియో వింటూ కూచున్నది.

౪

నలభైఅయిదు వత్సరాలు దాటిన సుందరమ్మకపత్యవాంఛ సన్నగిల్లింది. ఆమె స్థూలశరీరంవలన, భాగ్యవంతురాలు కావడంవలన, ఇంట్లో పని ముట్టుకోదు. వంటకత్తె ఒంటిగంటకు వెళ్లిసాయంత్ర

మూరు గంటలకు వస్తుంది. ఈ లోపున కాఫీ కాయడం- పనిమనిషికి అంట్లు, చెంబులు పడెయ్యడం ప్రతిదినం సుందరమ్మకు చాలా కష్టంగానుంది. నరసమ్మ రాగానే ఆమెకు మనశ్శాంతి కలిగింది కాని, నరసమ్మకూడా చాకిరీ కలవాటుపడిన స్త్రీ కాదు. సుందరమ్మ ఆదేశం ప్రకారం, నరసమ్మ నాలుగుగంటలకు కాఫీ కాచింది: పనిమనిషికి అంట్లు, చెంబులు వేసింది. స్నానాలగదిలో పొయిలో నిప్పువేసి నీళ్లకాగు దానిమీద పెట్టింది. ఆరుగంటలయినా, ఆపూట వంటావిడ రాలేదు. సుందరమ్మ మల్లెపూలుకొని, తాను పెట్టుకొని నరసమ్మనుకూడా పెట్టుకోమన్నది.

'అమ్మాయ్! ఇంతవరకూ వంటావిడ రాలేదు. ఇక ఈ పూట రాదల్లే వుంది. ఆమె ఇలాగే మధ్యమధ్య చెప్పకుండా మానేస్తుంటుంది. ఈ రోజుల్లో ధనవంతుల్ని చూస్తే ఎవరికీ లెక్క లేకుండాఉంది. కాస్త నువు నడుముకట్టుకుని ఈ పూట వంటచేయి. నేను దగ్గర వుండి అన్నీ నీకు చెబుతానులే' అన్నది సుందరమ్మ నరసమ్మతో.

నరసమ్మ తనకు వంటచేయడమలవాటు లేదనీ, చేతకాదనీ చెప్పడానికి సంకోచించి, సరేనన్నది. వంకాయకూర, చారు, కందిపచ్చడి చేసి వడియాలు వేయించమని పురమాయించి, సుందరమ్మ పెత్తనానికి వచ్చిన ఇంకో ప్లీడరు పెళ్లాంతో లోకాభిరామాయణం మాట్లాడుతూ కూచుంది. నరసమ్మ ఉష్ణోదకంతో జలకమాడి, అన్ని వస్తువులు తనంతటతానే కనుగొని - వంటచేసింది. ప్లీడరు ఆనందరావు ఇంటికి వచ్చి కాస్త విశ్రాంతి తీసుకొని ఏడున్నరకల్లా స్నానంచేసి భోజనానికి తయారయినాడు. నరసమ్మ వంట చేస్తుండగా సూరి ఇంటికి వచ్చి గుమాస్తా గదిలో కాగితాలకట్టలు పడేసి వెళ్ళిపోయాడు. సూరి ప్లీడరుగారి మూడవ గుమాస్తా. పెద్ద గుమాస్తా సబ్ కోర్టు పని చూస్తాడు; రెండో గుమాస్తా మున్సిఫ్ కోర్టు పని చూస్తాడు; సూరి ఆ యిద్దరికీ సహాయంగా లా పుస్తకాలు మోయడం - ఇంట్లో పనులు చూస్తూండడం చేస్తుంటాడు.

'నరసమ్మా! వారికి వడ్డించు. నా రెప్పుడో పొద్దున నాలుగు మెతుకులు తిని వెళ్లారు. శర్మ నెక్కడికేనా పంపించారా మీరు? అతను తరవాత భోజనం చేస్తాడులే!' అని అటు నరసమ్మతో - ఇటు భర్తతో మాట్లాడింది సుందరమ్మ ఏక సమయాన.

'శర్మ సినిమాకు వెళ్తానన్నాడు' ఆనందరావు ముఖాన విభూతి రుద్దుకూ.

'ఇతని కీ సినిమా వ్యసనం వదిలే దెప్పుడో...? పైన ఏవో డబ్బులు దొరికినప్పుడల్లా సినిమాకు పరిగెడతాడు!' అని సుందరమ్మ తానుకూడా భోజనానికి తయారయింది.

నరసమ్మ పుట్టింట్లో చవకబారు నవలలు చదవడం - సినిమాలు చూడడం - అల్లికకుట్లు కుట్టడం చేయడంవలన, ఆమెకు వంటలో ప్రవేశం లేదు. వంటంతా పాడయింది. వంకాయకూర ఉడకలేదు. చారులో ఉప్పెక్కువయింది - వడియాలు మాడిపోయి, బొగ్గులయినయి. కందిపచ్చడిలో అమిత కారం!

'అమ్మాయ్! నీకు వంట ఏమీ అలవాటు లేదు కాబోలు!' అన్నాడు ఆనందరావు.

'ఈ వంటావిడ మధ్యమధ్య ఇలా మానేస్తుంటే, చాలా ఇబ్బందిగా నుంటోంది. ఈమె బదులింకో మనిషిని మాట్లాడాలి. వంట నేను చేయడానికి బద్ధకించి నరసమ్మను చేయమన్నాను - ఆమెకు వండడం తెలుసునని!' అన్నది సుందరమ్మ.

నరసమ్మ మనస్సు చివుక్కుమన్నది. కళ్ళు నీళ్ళ పర్యంతమైంది. దుఃఖభారాని కాగలేక దొడ్లోకి వెళ్ళి కళ్లనీళ్ళు తుడుచుకుని వంటయింట్లోకి రాలేదు. సుందరమ్మ 'నరసమ్మా! మాకు కాసిని మంచినీళ్ళు పోసి, కాస్త పెరుగు వడ్డించు!' అన్నది.

నరసమ్మ ఆ మాటలు విని ఆమె ఆజ్ఞప్రకారం వంటయింట్లోకి వచ్చి వడ్డించింది. విద్యుద్దీప కాంతిలో సుందరమ్మ నరసమ్మ దుఃఖ వదనాన్ని చూచింది.

'పొరబా టెవరికైనా వస్తుంది! నీకు వంట చేతకాదని నాకు తెలియలేదు. మాటమాత్రం నీవు నాతో చెప్పలేదు. ఏదో జరిగిపోయింది. విచారపడబోకు!' అన్నది సుందరమ్మ.

నరసమ్మ సమాధానం చెప్పక విచారవదనయై నిలబడింది,

'శర్మ వచ్చేదాకా నీ వుండనక్కర్లేదు; నీవు అన్నం తిను. అతను ప్రతిరాత్రీ మేడమీద పరుంటున్నాడు. మేడమీద మంచంలో పరుపు - దిండ్లు ఉన్నాయి. నీవన్నం తిని వెళ్ళి పరుందువు గాని—'అని సుందరమ్మ నరసమ్మను భోజనం చేయవలసిందని బలవంతం చేసింది. నరసమ్మ తన భర్త ఏమంటాడో అని సంకోచించి, ఆదంపతుల వెండిపళ్లాలు కడిగి, అలమరలో దాచి, మధ్య హాలులో వచ్చి కూర్చుంది. సుందరమ్మ తన దక్షిణవైపు గదిలో పక్క సరి చేసుకొని వచ్చి 'ఏం నరసమ్మా! అన్నం తినకుండా కూచున్నావేం?" అన్నది.

"వారూ నేను కలిసి తింటాము లెండి! మొదటి నాడే ఆయనకంటే నేను ముందన్నం తింటే ఆయనకు కోపం వస్తుంది.' అన్నది నరసమ్మ.

ఆనందరావు తన ఆఫీసుగదిలో లా పుస్తకాలు చదువుతున్నాడు. ఎనిమిదిన్నర అయింది. వాకిట్లో గుర్రంబండీ ఆగింది. అందులో సుందరమ్మ చెల్లెలు, ఆమె భర్త, ముగ్గురు పిల్లలు దిగారు వాళ్లు సరాసరి లోనికి వచ్చి నాగరిక స్త్రీ నరసమ్మను చూచి-

'మా అక్కయ్యేదీ?' అన్నది సుందరమ్మ చెల్లెలు కమలమ్మ.

చెల్లెలు కంఠస్వరం గుర్తుపట్టి, సుందరమ్మ గదిలోనుంచి వచ్చి, అందర్నీ పరామర్శించింది. వాళ్లు కాళ్లు కడుక్కోవడానికి నీళ్ళిమ్మని సుందరమ్మ నరసమ్మకాజ్ఞాపించింది. నరసమ్మ లోపల విచారపడుతూ—వంటకత్తెవలె—వాళ్లకు పాదప్రక్షాళనార్థం—నీళ్ళిచ్చి—కమలమ్మ బంగారపు నగలు తిలకిస్తూ నిలబడింది.

'నరసమ్మా! నిప్పు చేసి ఓతవ్వడు బియ్యం కడిగి పెట్టు!' అన్నది సుందరమ్మ.

'అక్కయ్యా! ఈ అమ్మాయి ఎవరే?' అన్నది కమలమ్మ సుందరమ్మతో—

'మా మూడో గుమాస్తా భార్య! అతను మా యింట్లో నే వుంటున్నాడు. ఆ అమ్మాయి! పాపం- ఇవాళనే వచ్చిందతనితో కాపురం చేయడానికి- సరిగా ఇవాళనే వంటావిడ ఎగకొట్టింది.' అన్నది సుందరమ్మ చెల్లెలుతో. అక్కాచెల్లెళ్లు— చెల్లెలు భర్త కేశవరావు, పిల్లలు మధ్యహాలులో కూర్చుని ఒకరి మాట ఒకరు వినిపించుకోకుండా సంభాషిస్తుండగా—నరసమ్మ, తాసిల్దారు కూతురు నరసమ్మ, కన్నీరు కారుస్తూ, దొడ్లో బావివద్ద బియ్యం కడుగుతోంది. ఆనందరావు లా పుస్తకాన్ని ముగించి వచ్చి, మరదల్ని- షడ్డకుణ్ణీ పరామర్శించి- పిల్లల్ని దగ్గరకు తీసి వాళ్లని వరసని ముద్దెట్టుకున్నాడు. చంటివాణ్ణి ఎత్తుకుని, ముద్దెట్టుకొని 'కమలా! వీణ్ణి మాకిచ్చేస్తే మేం పెంచుకుంటాము!' అన్నాడు కేశవరావు వైపు దరహాసవదనుడై చూచి

వంటయింట్లో పొయ్యి మండక పొగతో కళ్లు మండిపోతున్న నరసమ్మకీ సరససల్లాపములు శూలాయమానములై గ్రుచ్చుకోసాగాయి. ఆమె పరిస్థితి రోడ్డుమీద నడిచే మనిషి కంఠంలోతు ఊబిలో ఇరుక్కు పోయినట్లుగానుంది! వెన్నెలరాత్రిలో ఒక్కసారి ఆకాశం అంతా కరాళ కజ్జల మేఘావృతమైనట్లుంది. తండ్రి గౌరవం కాపాడేటందుకు తాను తన భర్తతో కాపురం చేయడానికి వచ్చింది— తానీ ఊబిలో దిగబడటం కోసమా? అసలు వంటకత్తె ఆపూట రాక పోవడానికి సుందరమ్మయే కారణమేమో నన్న అనుమానం కలిగింది నరసమ్మకు!

కేశవరావు, శర్మ కోసం నరసమ్మ కాచిన వేడి నీళ్లు స్నానం చేసి, భోజనం చేస్తుండగా శర్మ సినిమా నుంచి వచ్చాడు. ఇల్లంతా పెళ్లియిల్లు వలె సందడిగా నుంది. వంటయింట్లో తన భార్య రాత్రి పదిగంటల వేళ అందరికీ వడ్డన చేయడం చూచాడు. సుందరమ్మ 'శర్మా నువు కూడా భోజనానికి లే! నీ భార్య నీవు భోజనం చేసిన తరవాత గాని భోజనం చేయనని పట్టు పట్టుతోంది పాపం! చిన్నపిల్ల- ఈ వాళ వంటకత్తె కూడా ఎగగొట్టింది, అందువల్ల వంటంతా ఇవాళ నే వచ్చిన ఆమెమీద పడింది?' అని అనునయవాక్యాలాడింది.

'వాళ్ల భోజనాలయిం తరవాత తింటాను లెండి. నేను నీళ్లు పోసుకోవాలి' అన్నాడు శర్మ.

వచ్చిన చుట్టాలకు మంచాలు, పక్కలు సుందరమ్మ ఏర్పాటు చేసింది. వాళ్లు భోజనాలు చేసి కబురు చెప్పుకుంటూ పరున్న తరువాత, శర్మ బావివద్ద చన్నీళ్లు స్నానం చేస్తుంటే నరసమ్మ వెళ్లి 'మీ కోసం వేణ్ణీళ్లుంచాను, ఆ చుట్టాలు పోసుకున్నారు!' అన్నది.

'దరిద్రుడికి నాకు వేణ్నీళ్లు కూడా దేనికి? తాసిల్దారు కూతురివి— నువు వేణ్నీళ్లు పోసుకుంటే అది సహజం!' అన్నాడు శర్మ భార్యతో.

శర్మకూడా నరసమ్మ వంటను వంక పెడుతూ భోజనంచేసి వెళ్లాడు. తరవాత నరసమ్మ త్వరత్వరగా భోజనంచేసి— తలుపులు వేసి– సరిగా ఎక్కడి సామానక్కడ సర్దక— అప్పటికే పదకొండుగంటలు దాటటంవలన— మేడమీదకు వెళ్లింది.

౫

తన భార్యవచ్చి పరుండటం గుర్తించి శర్మ 'నీ మనస్సిలా మారిపోయిందేం?' అన్నాడు.

'నా మనస్సెపుడూ ఒకలాగున నేవుంది. మీరు నెలకు ఏభయిరూపాయిలు సంపాయిస్తున్నారని మా నాన్నకు మీప్లీడరు గారివల్ల తెలిసి—నన్ను మీతో కాపురం చేయడానికి పంపించారు. మన కాపురానికి కావలసిన పాత్రసామాను, మంచం, పరుపు, కుర్చీలు- మొదలైనవి చాలా కొనియిచ్చారు మాఅమ్మా, నాయనా. ఇక్కడి పరిస్థితు లేమిటో నాకు తెలియదు. సాయంత్రం నాలుగుగంటలనుంచీ సుందరమ్మగారు నన్నరగదీసి వదలింది. మీరు ఏభయిరూపాయిలు సంపాదిస్తుండగా, మన మిక్కడ వీళ్లకు బానిసలలాగున వుండవలసిన అవసర మేముంది? మనకా ఏభయి రూపాయిలు చాలకపోతే— మా నాన్న నెలకో పాతిక రూపాయిలు పంపుతా నన్నాడు! మనం హాయిగా వేరే ఎక్కడైనా కాపురముందాము. ఇంతధనవంతుల యింట్లో వుండడం చాలా కష్టం!' అన్నది నరసమ్మ.

'ఇక్కడ నాపరిస్థితి నాకే దుర్భరంగావుంటే ఇక్కడ నీవస లుండలేవు! నాతండ్రి వద్దనుంచి నాకు కానీ వచ్చేఅవకాశంలేదు. నాకింకెక్కడా వుద్యోగం దొరికే అస్కారం లేదు. ఈప్లీడరుగారు పెట్టుబడి పెట్టి నాతండ్రిమీద వ్యాజ్యంనడుపుతానని వాగ్దానం చేశాడు. నేనిక్కడ చేస్తున్న ఉద్యోగానికి నాకు వీళ్లు కానీ యివ్వటంలేదు. కాని ప్రతినెలా ఏభయిరూపాయిలు గిడుతున్న మాట యథార్థమే. రెండుపూటలు భోజనం ౩౦ రూ లు. కాఫీ రెండుపూటలూ రూ ౧౦ లు. ఉండడానికి గది—చాకలి మంగలి ఖర్చుకు పదిరూపాయలు. వెరసి ఏభయిరూపాయలు. అంటే సారాంశం ఏమంటే— వీళ్లింట్లో కాలక్షేపం చేయడం—వీళ్లుచెప్పిన పనులు చేస్తుండడం! ఈవూరులో బావుల్లో నీళ్లు పాతాళలోకంలోనుంటాయి. ఉదయం పదిబిందెలదాకా నీళ్లు తోడలేక నాచేతులు కాయలు కాచినాయి. నాసంగతంతా కనుక్కొని, నాకు పెళ్లయిందని తెలుసుకుని—నిన్ను కూడా ఇక్కడకు పిలిపించి— వంటమనిషి అవసరం లేకుండా నీచేత చాకిరీ చేయించుకుందామని— నాకు తెలియకుండా ఈ ప్లీడరుగారు మీనాయనకు పేచీ వేశాడు. మీనాయన ఇక్కడి యథార్థపు పరిస్థితులు తెలియక నిన్నిక్కడికి తీసుకవచ్చి దించాడు. నాతండ్రినుంచి భాగం పంచుకోగలిగితే—అప్పుడు మనకేమీ దిగులుండదు నరస్సా!' అన్నాడు సూరి భార్యా విధేయుడై— కష్టాలు భరించలేని ఆవేదనతో—

'మనం విడిగా కాపురముంటే ఈ ఏభయిరూపాయిలూ ప్లీడరుగారు డబ్బుగా యిస్తారా?" అన్నది నరసమ్మ వ్యవహారజ్ఞానంతో.

'అహ! యివ్వరు. కాని కూడా ఇవ్వరు. పైన ఎప్పుడైనా పావలా— అర్థరూపాయి దొరికిన నాడు తప్ప—నావద్దకానీ వుంటంలేదు! మీనాన్నకు రేపే వుత్తరం రాయి—ఇక్కడి పరిస్థితినంతా వివరంగా తెలియబరుస్తూ!' అన్నాడు సూరి.

'మీ నాన్నమీద వ్యాజ్యం మానాన్న మీచేత ఆడిస్తాడు. మీరిక్కడ యీ నికృష్టపు పనులన్నీ చేస్తూ ఇన్ని కష్టాలు పడుతున్నారంటే— వింటున్న నాకు కడుపు తరుక్కుపోతున్నది. మానాన్నగారు తాసిల్దారు. కావలసినంత పలుకుబడి కలవాడు. రేపుదయం మన సామానంతా తీసికొని మాపుట్టింటికిపోదాం!' అన్నది నరసమ్మ.

'రైలుచార్జీకి కాదుగదా— విషంపుచ్చుకోడానికైనా నావద్దకానీ లేదు!' అన్నాడు సూరి.

'నా వద్ధనుంది లెండి డబ్బు. రేపుదయం బండీకే మనంయిక్కడినుంచి వెళదాం! నీళ్లే తోడుకుంటారో వంటే చేసుకుంటారో— వాళ్ల తిప్పలు వాళ్లు పడతారు. మీచేతవ్యాజ్యం వేయించి— దావాలో

గెలిస్తే, ఫీజుకింద ఏనాలుగెకరాలో కాజేద్దామని యీ ప్లీడరుగారు మీకు అన్నీ తనయింట్లోనే— ఏర్పాటుచేశాడు!' అన్నది సరసమ్మ, బాగాతన ఆలోచనా శక్తిని వినియోగించి.

పగలంతా తీరుబడిలేక— సినిమా చూడకుండా ఉండలేక— శర్మ గాఢనిద్రచెందాడు. తెల్లవార్లూ నరసమ్మ తన దురదృష్టాన్ని నిందించుతూ— భర్త తనకు విధేయుడైనందుకు సంతోషించింది. 'తడిసి గాని గుడిసెకప్పడు' అన్న సామెతవిధంగా—బాగా కష్టపడిన తరువాత తన భర్తకు జ్ఞానం కలిగిందనుకుంది.

తెల్లవారగానే శర్మప్లీడరుగారితో 'నాభార్య ఇక్కడ వుంటానికిష్టపడటంలేదు. దానిని పుట్టింట్లో దించివస్తాను!' అని చెప్పాడు. ఆనందరావు—సుందరమ్మ ఆమాటలువిని, నిర్ఘాంతపోయారు. నరసమ్మను పిలిచి ఆమెతో 'అమ్మాయ్! నిన్నవంటావిడ రానందున నిన్ను వంటచేయమన్నాను. ఇక ఎన్నడూ నీచేత చేయించదలుచుకోలేదు. అసలునీకు వంటచేయడం తెలియదుకూడా! పిల్లలులేని మాకు మీరిద్దరూ అండగా వుంటారనుకున్నాను. చిలుకా, గోరంకల్లాగా మా మేడలో కాపురముంటారని వారూ, నేను ముచ్చటపడ్డాము! నామాట వినవూ?' అన్నది సుందరమ్మ.

'మా నాన్నగారు యిక్కడిపరిస్థితులు స్వయంగావచ్చిచూచి విచారించకుండా, త్వరపడి నన్ను తీసుకవచ్చారు. నేనిక్కడ ఒక్కక్షణం ఉండలేను.' అన్నది నరసమ్మ దృఢనిశ్చయంతో. శర్మ రెండు బండ్లు మాట్లాడుకొని వచ్చి, వాటిలో ఒకదానిలో సామానంతా పెట్టి, రెండోబండిలో భార్యా తాను ఎక్కి స్టేషన్‌కు బైలుదేరుతూ— 'అయ్యా! ప్లీడరుగారూ! నా వ్యాజ్యం విషయం మటుకు మరిచిపోండి' అన్నాడు. ఆనందరావు యీ ఆకస్మిక విపర్యయమున కంతకూ కారణం కొత్తగావచ్చిన నరసమ్మ అని తెలుసుకొని అంతులేని ఆశ్చర్యంలో మునిగాడు.